క్లుప్తంగా

సోమర్యాగడి తండాలో భోగ్‌బండార్



ఎల్లారెడ్డి: మండలంలోని సోమర్యాగడి తండాలో శుక్రవారం భోగ్‌బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవాఘడ్ ఆలయంలో నిర్వహించిన భోగ్‌బండార్‌లో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సేవాలాల్ స్వాములు, తండా నాయకుడు లకావత్ రవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుర్మ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



తాడ్వాయి: చిట్యాల గ్రామానికి చెందిన పీఈ ర్టీయూ జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రావు తండ్రి శ్రీహరిరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబీకులను ఎంపీ బీబీ పాటిల్ కామారెడ్డిలో శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, గ్రామపెద్దలు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



తాడ్వాయి: ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ తాడ్వాయి మండల నాయకులు బాన్సువాడలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు షౌకత్‌అలీ, జంగంరాజు, వెంకట్‌రాంరెడ్డి, శ్యాంరావు, హన్మాండ్లు తదతరులు ఉన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



సదాశివనగర్: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని విండో సీఈవో నహీం అన్నారు. మండలంలోని యాచారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో శిరీష, విండో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నీరు.. రోజు విడిచి రోజు



భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డిలో మంచి నీటి కుళాయిల్లో రోజు విడిచి రోజు తాగు నీరు సరఫరా అవుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలోని కొన్ని వార్డులకు ఒక్క రోజు మిగతా వార్డులకు మరో రోజు మంచినీటి కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో ప్రతి రోజు నీటి సరఫరా అయ్యేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండలాల చైర్మన్ల నియామకం



బాన్సువాడ: బాన్సువాడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండలాల చైర్మన్లకు మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌సింగ్ నియామక పత్రాలను శుక్రవారం అందజేశారు. బాన్సువాడ డివిజన్ ఎస్టీ సెల్ చైర్మన్‌గా చందర్ జాదవ్, డివిజన్ ఉపాధ్యక్షుడిగా రవి చౌహాన్, బీర్కూర్ చైర్మన్‌గా దిలీప్ చౌహాన్, మండల ఉపాధ్యక్షుడిగా మహేందర్‌నాయక్, నస్రూల్లాబాద్ చైర్మన్‌గా శంకర్‌నాయక్, మండల ఉపాధ్యక్షుడిగా సునీల్ రాథోడ్, బాన్సువాడ చైర్మన్‌గా రూప్ సింగ్, మండల ఉపాధ్యక్షుడిగా కిషన్ నాయక్‌ను నియమిస్తూ నియమక పత్రాలను అందించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కామారెడ్డిలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు



మద్నూర్‌లో కాంగ్రెస్ నాయకులు



బిచ్కుందలో..

ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి



లింగారెడ్డిపేటలో..



బాన్సువాడలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతిని జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి, చిత్రపటాలకు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్ రామ్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కామారెడ్డిలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎల్లారెడ్డి, బిచ్కుంద, భిక్కనూరు, బాన్సువాడ, నస్రుల్లాబాద్, బీర్కూర్, బాన్సువాడ, మద్నూర్, జుక్కల్, కామారెడ్డిలో జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు.



భిక్కనూరులో..



నస్రూల్లాబాద్‌లో బీఆర్‌ఎస్ నాయకులు



మద్నూర్ గ్రామ పంచాయతీలో..

ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడో..?



బీర్కూర్ సహకార సంఘంలో గన్నీ సంచులను దించుతున్న హమాలీలు

- గ్రామాల్లో ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- ఇబ్బందుల్లో రైతులు
- పట్టించుకోని అధికారులు

బాన్సువాడ: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈ నెల 1 నుంచే ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా కొన్ని చోట్ల ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీర్కూర్, నస్రూల్లాబాద్, బాన్సువాడ మండలాల్లో కొన్ని చోట్ల తూతూ మంత్రంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి వదిలేశారు. రైతులు పండించిన పంట దళారుల పరం కాకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సూచించినా సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో ఆయా మండలాల్లో ఇప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీర్కూర్ సహకార సంఘానికి గన్నీ సంచులు వచ్చినా హమాలీలు రావడం లేదనే సాకుతో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇప్పటికీ ప్రారంభించలేదు. ఇప్పటికే పలు చోట్ల 60 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులు, మిల్లర్ల యజమానులు కొనుగోలు చేశారు. దీంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక రైతులు తక్కువ ధరకు దళారులకు విక్రయిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రంజాన్ మాసం పవిత్రమైనది



మద్నూర్(జుక్కల్): రంజాన్ మాసం ముస్లిములకు ఎంతో పవిత్రమైనదని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. డోంగ్లీ మండలంలోని మొగాలో శుక్రవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రంజాన్ మాసంలో ముస్లిములు నిత్యం అల్లా ధ్యానంలో ఉంటారని అన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీజేపీలో చేరిన యువకులు



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల రవీందర్ పాటు దేవునిపల్లికి చెందిన యువకులు శుక్రవారం కామారెడ్డి ఎమ్మెల్యే కే. వెంకటరమణారెడ్డి సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు. అలాగే 41వ వార్డుకు చెందిన యువకులు సైతం బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు స్వేచ్ఛ

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, ఎంపీ అభ్యర్థి షెట్కార్‌ను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

లింగంపేట: కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు స్వేచ్ఛ ఉందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని అమృత కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ నియంత పాలన అంతమైందని, పదేళ్లలో రాష్ట్రానికి చేసిందేమి లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. ప్రజల దాహార్తి తీర్చడానికి నియోజకవర్గంలో 200 బోర్లు వేయించి తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే యువతకు ముప్పైవేల ఉద్యోగాలు కల్పించిందని ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ అన్నారు. అనంతరం ఎల్లారెడ్డి జడ్పీటీసీ ఉషాగౌడ్ బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మైనార్టీ నాయకులు ఎమ్మెల్యే, షెట్కార్‌ను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు నారాగౌడ్, ఫతియొద్దీన్, సంతోష్‌రెడ్డి, ఐదీర్, సిద్ధారెడ్డి, రఫియొద్దీన్, జొన్నల రాజు, విఠల్‌రెడ్డి, రాంరెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతకు పరామర్శ



భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ గ్రామ బీఆర్‌ఎస్ నేత కుంట భూంరెడ్డి తల్లి రాజవ్వ ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట కామారెడ్డి ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు ద్యావర సాయిరెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ వంగేటి చిన్న నర్సారెడ్డి, నేతలు దుర్గారెడ్డి, పైడి నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్, గైని శ్రీనివాస్ ఉన్నారు.

మరమ్మతులకు నోచుకోని జీపీ ట్రాక్టర్లు

- అపరిశుభ్రంగా మారుతున్న పల్లెలు
- పట్టించుకోని అధికారులు



బురుగుపల్లిలో పాడైపోయిన జీపీ ట్రాక్టర్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): గ్రామాల్లో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడంతో పాటు హరితహారం, పల్లె ప్రకృతి వనం లాంటి మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేసేందుకు ఉపయోగించాల్సిన జీపీ ట్రాక్టర్లు పలు గ్రామలలో పాడైపోయాయి. వీటికి మరమ్మతులు చేయించాల్సిన అధికారులు పట్టించుకోకుండా పోవడంతో తుప్పు పడుతున్నాయి. మండలంలోని బురుగుపల్లి, సంముందర్ తండా, కాటేపల్లి తండాతో పాటు పలు గ్రామాల్లోని జీపీ ట్రాక్టర్లు పాడైపోయాయి. గత ప్రభుత్వం ప్రతి గ్రామనికి రూ. లక్షలు ఖర్చు చేసి ట్రాక్టర్లను కేటాయించింది. అవి ఇప్పుడు మరమ్మతులకు నోచుకోకుండా ఉండడంతో తుప్పుబడుతున్నాయి. ట్రాక్టర్లు మూలన పడడంతో గ్రామాల్లోని చెత్త ఎక్కడ పడితె అక్కడ దర్శనమిస్తోంది. దీంతో పలు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పాడైపోయిన గ్రామ పంచాయతీ ట్రాక్టర్లను మరమ్మతులు వాడుకలోకి తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చలివేంద్రం ప్రారంభం



దోమకొండ: మండలంలోని ముత్యంపేటలో చలివేంద్రాన్ని మాజీ ఉపసర్పంచ్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి ముత్తగారి శిరీష్‌గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. తన తండ్రి సాయాగౌడ్ జ్ఞాపకార్థంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో భైరవప్రసాద్‌రెడ్డి, ముత్తి శివయ్య, కిష్టయ్య, లింగం, రొడ్డ బాల్‌నర్స, రాజు, భాస్కర్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కుస్తీపోటీలు



బాన్సువాడ రూరల్: మండలంలోని కొల్లూర్‌లో శుక్రవారం గ్రామ దేవతల పండుగ సందర్భంగా నిర్వహించిన కుస్తీపోటీలు ఆకట్టుకున్నాయి. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. అలాగే కులసంఘాల ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఏడాది గ్రామ దేవతల పండుగను రెండు రోజుల పాటు నిర్వహిస్తామని గ్రామస్తులు పేర్కొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి



నియామకపత్రం అందజేస్తున్న గణేశ్

బాన్సువాడ రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి గణేశ్ అన్నారు. మండలంలోని సోమేశ్వర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బీమ నరేందర్, ఉపాధ్యక్షులుగా పసుపుల మొగులయ్య, ఎండీ ఇల్యాస్, పిట్ల మొగులయ్య, మద్దల సాయిలు, కోశాధికారిగా బొప్పని మొగులయ్య ఎన్నికయ్యారు. అనంతరం వీరికి నియామకం పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మాసాని శ్రీనివాస్‌రెడ్డి, బోనాల సుభాష్, భూనేకర్ ప్రకాశ్, బుడ్మి నబీ, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

శబరిమాత ఆశ్రమంలో పూజలు



తాడ్వాయి: మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. శబరిమాత చిత్రపటం, పాదుకలను పల్లకీలో ఉంచి ఆశ్రమం ఆవరణలో పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాజాగౌడ్, బాపురావు, సిద్ధారెడ్డి, సూర్యం, గంగారాం, లక్ష్మీపతి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో..



మాచారెడ్డి: మండలంలోని సోమారాంపేట హనుమాన్ ఆలయంలో ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి దేవయ్య కుంకుమ పూజ విశిష్టత గురించి వివరించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నీలా, మాజీ ఉప సర్పంచ్ సుశాంత్, గ్రామస్తులు మోహన్, బాల్‌రాజ్ గౌడ్, రవి, శ్రీనివాస్, ఆశిరెడ్డి, నాంపల్లి, రాము, రాజు, బాలు, స్వామి ఉన్నారు.

కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ



ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న గంగారాం

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మగ్దుంపూర్, గిర్ని తండా, దూప్ సింగ్ తండా జీపీలోని ఉపాధి హామీ కూలీలకు స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ గంగారాం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను శుక్రవారం అందజేశారు. మండుటెండల్లో ఉపాధి పని చేసిన కూలీలు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు వీటిని పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

లింగాయత్ కార్పొషన్ ఏర్పాటుపై హర్షం



మద్నూర్(జుక్కల్): సీఎం రేవంత్‌రెడ్డి లింగాయత్ సమాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై మండల లింగాయత్‌లు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని అవాల్‌గావ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ చిత్రపటానికి పార్టీ నాయకులు, గ్రామస్తులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామ లింగాయత్ అధ్యక్షుడు విఠల్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, గ్రామ పెద్దలు గోవింద్, కాశప్ప, సిద్ధప్ప, హనుమంత్, బాలాజీ, గణపత్, సురేశ్, మారుతి, శివరాజ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రైవేట్ పీఈటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని పీఈటీలు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం పీఈటీల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రైవేట్ పీఈటీలు అంకుష్, సతీశ్, మైపాల్, శివకుమార్, నరేశ్, రవి, నవీన్, రాజువీర్, రాజు, సురేశ్, రంజిత్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

రేపు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ఎల్లారెడ్డి: మండల కేంద్రంలో ఈనెల 7న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సాయిబాబా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6, 7వ తరగతులకు సంబంధించి ప్రవేశ పరీక్ష ఉదయం, మధ్యాహ్నం ఉంటుందన్నారు. విద్యార్థులు గంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

నేడు బీఆర్‌ఎస్ దీక్ష

కామారెడ్డి క్రైం: ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా శనివారం దీక్ష కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గంప గోవర్ధన్, జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్‌ల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉదయం 10.30 గంటకు దీక్షా కార్యక్రమం ఉంటుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

బాన్సువాడలో..

బాన్సువాడ: పట్టణ కేంద్రంలో బీఆర్‌ఎస్ నిరసన దీక్షను శనివారం చేపట్టనున్నట్లు బీఆర్‌ఎస్ పట్టణ కార్యదర్శి నార్ల ఉదయ్ శుక్రవారం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయనందున పార్టీ అధిష్ఠానం మేరకు స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిరసన దీక్ష చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దీక్షకు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అయ్యపల్లిలో ఎడ్లబండ్ల ప్రదర్శన

లింగంపేట: మండలంలోని అయ్యపల్లిలో ఉన్న ప్రభుస్వామి ఆలయంలో శక్రవారం ఎడ్లబండ్ల ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మండల కేంద్రానికి చెందిన పార్శి వెంకటేశం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శంకరప్ప, పార్శి ప్రభాకర్, లక్ష్మీపతి, శ్రీనివాస్, విశ్వేశ్వర్ పంతులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ అభివృద్ధికి రామారెడ్డి మండలం రెడ్డిపేట గ్రామానికి చెందిన ఎంబరి రాజు, లావణ్య దంపతులు రూ. 21వేల విరాళాన్ని ఆలయ సిబ్బందికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు దాతలకు స్వామి వారి చిత్ర పటాన్ని బహూకరించి సత్కరించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూదన్ : 9951027699
ఎల్లారెడ్డి: డి. యల్. ఎన్. గౌడ్ : 6300453108
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899